
సాక్షి
కాకినాడ

ఆదివారం । 14 । మే । 2023




మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరికీ అవసరమని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి, ఆంగ్ల విభాగాధిపతి ప్రసాద్ కృష్ణారావు అన్నారు. - 8లో▸



మిగులు జలాల విడుదల పెంపు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం మిగులు జలాల విడుదలను పెంచారు. 12,871 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు.



ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
కాకినాడ	37.2	27.1
రాజమండ్రి	44.5	27.0
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

రత్నగిరిపై కొనసాగుతున్న భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శించి వెలుపలకు వస్తున్న నవదంపతులు

అన్నవరం: పెద్ద సంఖ్యలో జరుగుతున్న పెళ్లిళ్లతో సత్యదేవుని సన్నిధికి వస్తున్న వధూవరులు, బంధుమిత్రులు, మరో వైపు సాధారణ భక్తులతో సత్యదేవుని ఆలయం శనివారం కిక్కిరిసిపోయింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. రత్నగిరిపై శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. మిగిలిన ప్రాంతాలలో కూడా అదే సుముహూర్తాలలో వివాహాలు జరిగాయి. వివాహాలనంతరం నవదంపతులు సత్యదేవుని ఆలయానికి తరలివచ్చి స్వామివారి వ్రతాలాచరించారు. వ్రతమండపాలు, క్యూలైన్లు, స్వామివారి ఆలయం వీరి సందడి కనిపించింది. 2,500 వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది.

నవోదయ 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

పెద్దాపురం: జవహర్ నవోదయ విద్యాలయ 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. జూలై 22వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జాతీయ రహదారి పరిశీలన



కత్తిపూడి–ప్రత్తిపాడు జాతీయ రహదారిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: కత్తిపూడి–ప్రత్తిపాడు జాతీయ రహదారిలో ప్రమాదకర ప్రాంతాలను శనివారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈ రహదారిలోని కొత్త వజ్రకూటం, చెందుర్తి, వన్నెపూడి కూడళ్లలో ఏర్పాటు చేసిన స్టాపర్లు, టైర్లు సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. హైవే మొబైల్ పరిధిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బద్రత చర్యలు పెంచాలని సిబ్బందికి సూచించారు.

శనైశ్చరునికి రూ.3.57 లక్షల రాబడి

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి శ్రీ ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. ప్రాతఃకాలార్చన అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి, తైలాభిషేకాలకు అనుమతించారు. ప్రత్యక్షంగా తైలాభిషేకాలు, సేవల టికెట్ల ద్వారా రూ.1,10,820, ఈ నెల 1 నుంచి శనివారం వరకూ ఆన్‌లైన్‌లో రూ.2,20,626, అన్నప్రసాద విరాళాలుగా రూ.25,589 కలిపి స్వామివారికి రూ.3,57,035 ఆదాయం సమకూరిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు.

పచ్చని కానుక



- నాటుకుంటున్న మొక్కల బహుమతుల కల్చర్
- బొకే..దండలకు బదులుగా వీటికి స్థానం
- కడియపులంక నర్సరీల్లో భారీఎత్తున విక్రయాలు
- పర్యావరణ ప్రేమికుల కొత్త ట్రెండ్ ఇది..

రామకృష్ణ రిటైర్డ్ బ్యాంకు అధికారి. కుమార్తెకు వివాహం కుదిరింది. రెండు రోజుల్లో నిశ్చితార్థం. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అతిథులకు, వియ్యాలవారికి రిటర్న్ గిఫ్ట్ కొత్తగా ఏదైనా ఇవ్వాలని ఆయన ఆలోచన. రోజూ సాయంత్రం వాకింగ్‌లో కలిసే మిత్రుడిని సలహా అడిగారు. ఆకర్షణీయమైన మొక్కలను ఇద్దామని సూచించారు. అది రామకృష్ణకు నచ్చింది. వెంటనే కడియపులంక నుంచి తెప్పించి, వాటినే బహూకరించారు.

(రాజమహేంద్రవరం డెస్క్)



రామకృష్ణ ఒక్కరే కాదు. ఇటీవల కాలంలో చాలామంది పర్యావరణ హితం కోరుతూ బహుమతుల జాబితాలో మొక్కలను చేరుస్తున్నారు. జీవం ఉన్న బుల్లి మొక్కలను బహుమతిగా ఇస్తూ ప్రకృతిపై ప్రేమను చాటుకుంటున్నారు. పూలదండలు, పుష్పగుచ్ఛాల స్థానాన్ని క్రమంగా ఇప్పుడు ఇలాంటి గిఫ్ట్ ప్లాంట్స్ ఆక్రమిస్తున్నాయి. పెద్ద నాయకులు పర్యటనకు వచ్చినా, ఓ ఉద్యోగి రిటైరైనా శాలువా, మెమెంటోలతో పాటు గిఫ్ట్ ప్లాంట్లు కూడా తప్పనిసరి అయ్యాయి. కాన్వెంట్లో విద్యార్థి పుట్టిన రోజు నాడు క్లాస్ టీచర్లకు తల్లిదండ్రులు మొక్కలనే పిల్లలతో గిఫ్ట్‌గా ఇప్పిస్తున్నారు. అదొక్కటే కాదు పచ్చదనాన్ని ఇష్టపడే ఏ ఇంటి హాల్లో టీపాయ్‌పైన చూసినా ఒకటో, రెండో గిఫ్ట్ ప్లాంట్స్ కనిపిస్తాయి. మొక్కలు ఆక్సిజన్‌ను రిలీజ్ చేస్తాయని, ఎయిర్ ప్యూరిఫయర్‌గా ఉపయోగపడతాయని ఇలా చేస్తున్నారు.

ఇదో పెద్ద పరిశ్రమ

గిఫ్ట్ ప్లాంట్స్ ..ఇప్పుడో పెద్ద పరిశ్రమ. దీనికి కేరాఫ్ రాష్ట్రంలోనే అతి పెద్ద హోల్‌సేల్ మార్కెట్ కడియం, కడియపులంక. 15 ఏళ్ల క్రితం గిఫ్ట్ ప్లాంట్స్ విక్రయాలు మొదలయ్యాయి. స్వల్పకాలంలోనే నర్సరీ రంగంలో ఓ ప్రత్యేక విభాగంగా ఇవి రూపుదిద్దుకున్నాయి. ప్రస్తుతం వాటి టర్నోవర్ రూ.కోట్లలోకి చేరుకుంది. జామియా కులకస్, పొట్టి రకానికి చెందిన స్నేక్, రంగురంగుల అగ్లోనిమాలు, మెరంటా, సింగోనియం, సక్యలెన్స్ వంటి మొక్కలు గిఫ్ట్ ప్లాంట్స్‌గా ఆదరణ పొందాయి. పీస్ లిల్లీ, ఆంథూరియం, కలించీ, ఆర్కిడ్స్ వంటివి పూలతో కూడిన గిఫ్ట్ ప్లాంట్స్. వాటిలో ఆక్సిజన్ ప్లాంట్‌గా పిలిచే జామియా కులకస్ ఎక్కువగా అమ్ముడయ్యే గిఫ్ట్‌ప్లాంట్. వీటిని పూణె, బెంగళూరుల నుంచే గాకుండా థాయ్‌లాండ్, చైనా వంటి ఇతర దేశాల నుంచి ఇక్కడ నర్సరీల యజమానులు దిగుమతి చేసుకుంటున్నారు. గిఫ్ట్‌ప్లాంట్స్ చిన్నవి, సున్నితమైనవి కావడంతో ఎండవానల నుంచి రక్షణకు పాలీహౌస్‌లలో విక్రయానికి ఉంచుతారు. వాటి కోసం పెద్దపెద్ద నర్సరీల యాజమానులు రూ.లక్షలు ఖర్చు చేసి పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. కడియపులంక ప్రాంతంలో 40 వరకూ పాలీహౌస్‌లు ఉన్నాయి. ఇక్కడి నుంచి విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, అమలాపురం, ఏలూరు, గుంటూరు, నెల్లూరు వంటి నగరాలకు సరఫరా అవుతుంటాయి. ఒక్కోగిఫ్ట్ ప్లాంట్ రకాన్ని బట్టి ఇంచుమించు రూ.250 నుంచి రూ.1000 వరకూ రేటు పలుకుతోంది.

వెలెన్షియాలు..

సాధారణంగా 4, 5, 6 అంగుళాల సాధారణ కుండీల్లో గిఫ్ట్ ప్లాంట్స్ అందుబాటులో ఉంటాయి. మట్టికి బదులు పోషకాలు ఎక్కువగా ఉండే పాట్ మిక్స్ వాడుతుంటారు. మొక్కలతో కూడిన ఆ కుండీలను అంతకంటే అర అంగుళం ఎక్కువ సైజులో వివిధ రంగుల్లో, ఆకర్షణీయంగా ఉండే మరో కుండీలో ఉంచుతారు. దానిని వ్యవహారికంగా అవుటర్ పాట్ అంటారు. అసలు పేరు వెలెన్షియా.ప్లాస్టిక్ కుండీలు, గార్డెన్ ఉపకరణాలు తయారు చేసే పెద్దపెద్ద కంపెనీలే వివిధ రూపాల్లో, డిజైన్లలో ఆకట్టుకునేలా ఈ వెలెన్షియాలను తయారు చేస్తున్నాయి. వీటి అవుట్‌లెట్‌లు కడియపులంక ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయి.

న్యూ ఇయర్ వేడుకల్లో కీలకం

నూతన సంవత్సర వేడుకలకు ఆత్మీయులకు గిఫ్ట్ ప్లాంట్స్‌ను బహుమతిగా ఇవ్వడం ఇప్పటి ట్రెండ్. కడియం,కడియపులంకల్లో ఏడాది పొడవునా సాగే విక్రయాయి ఒక ఎత్తయితే, న్యూ ఇయర్ పేరుతో జరిగే గిఫ్ట్ ప్లాంట్స్ విక్రయాలు మరో ఎత్తు. ఈ క్రమంలో డిసెంబర్ మూడో వారం నుంచి కడియం, కడియపులంకలలోని ప్రధాన నర్సరీల యజమానులు ఏటా సరికొత్త రకాల గిఫ్ట్ ప్లాంట్స్‌ను దిగుమతి చేసుకుంటారు. డిసెంబర్ కావడంతో వాటిలో వివిధ రకాల స్వదేశీ, విదేశీ రకాల పూలమొక్కలు కూడా ఉంటాయి. డిసెంబర్ ఆఖరి వారంలోనే రూ.కోట్లలో గిఫ్ట్ ప్లాంట్స్ విక్రయాలు జరుగుతాయి.



పాలీహౌస్‌లో విక్రయానికి గిఫ్ట్ ప్లాంట్స్



ఆక్సిజన్ ప్లాంట్‌గా పిలిచే జామియా కులకస్



రంగురంగుల వెలెన్షియాలు

గిఫ్ట్ ప్లాంట్‌తో స్వాగతం



రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో సందర్శనకు తరచూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. వారికి గతంలో పుష్పగుచ్ఛాలను ఇచ్చి స్వాగతం పలికేవారం. వాటికి బదులు కొంతకాలంగా గిఫ్ట్ ప్లాంట్స్ ఇచ్చి ఆహ్వానిస్తున్నాం. పుష్పగుచ్ఛాలు రెండు రోజులకే వాడిపోతాయి. గిఫ్ట్ ప్లాంట్స్ ఎక్కువ కాల ఉంటాయి. ఆక్సిజన్‌ను ఇస్తాయి. పర్యావరణ రక్షణకు మేం కూడా ఎంతో కొంత మేలు చేసినట్లూ ఉంటుంది.

– వీఎస్ఎల్ రావు, ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్, రాజమహేంద్రవరం డిపో

12 ఏళ్లుగా విక్రయిస్తున్నాం



కడియపులంకలో 12 ఏళ్లుగా గార్డెన్ ఉపకరణాలు విక్రయిస్తున్నాం. ప్రారంభంతో పోలిస్తే ఇప్పుడు వెలెన్షియాల విక్రయాలు బాగా పెరిగాయి. అన్ని సైజుల్లో, రంగుల్లో మా వద్ద అందుబాటులో ఉంటాయి. వివిధ నగరాలు, పట్టణాల నుంచి వచ్చి కొనుగోలు చేసి తీసుకు వెళుతుంటారు.

– రాజ్‌కుమార్ పాండే, మేనేజర్, హర్ష్‌దీప్, గార్డెన్ ఉపకరణాల అవుట్‌లెట్, కడియపులంక

సబ్సిడీపై పాట్ మిక్స్ ఇవ్వాలి



రాష్ట్రంలోనే అతిపెద్ద గిఫ్ట్ ప్లాంట్ మార్కెట్‌గా కడియం, కడియపు ఎదిగాయి. గిఫ్ట్‌ప్లాంట్స్ ఆక్సిజన్‌ను ఇవ్వడమే కాదు, ఎయిర్ ప్యూరిఫయర్స్ కూడా. వాటిని విక్రయించే నర్సరీలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అవసరం. ప్రధానంగా ఉద్యాన శాఖ ద్వారా మట్టికి బదులుగా గిఫ్ట్ ప్లాంట్‌కు వినియోగించే పాట్ మిక్స్‌ను రాయితీపై ఇచ్చి ప్రోత్సహించాలి.

– మల్లు పోలరాజు, శివాంజనేయ నర్సరీ అధినేత, కడియపులంక

బాలబాలాజీ స్వామికి రూ.2.92 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.2.92 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.97 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.95,155 వచ్చాయి. స్వామి వారిని 3,572 మంది దర్శించుకున్నారు. 3,029 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ డి.శ్రీరామ వరప్రసాదరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఉద్యోగులు పర్యవేక్షించారు.

విజయవాడలో నేడు సత్యదేవుని శాంతి కల్యాణం

10వేల మందికి ప్రసాదం పంపిణీ



భక్తులకు పంపిణీ చేయడానికి తయారు చేసిన సత్యదేవుని ప్రసాదం

అన్నవరం: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో భాగంగా ఆదివారం రాత్రి సత్యదేవుని శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 7–30 గంటలకు దివ్యకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను తీసుకుని స్వామివారి అర్చక స్వాములు, వేదపండితులు, కల్యాణ పండితులు, వ్రతపురోహితులు ఆదివారం ఉదయం విజయవాడకు బయలుదేరుతున్నారు. ఇప్పటికే దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, అర్చకులు, వ్రతపురోహితులు యాగం ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. కల్యాణం అనంతరం పది వేల మందికి సత్యదేవుని ప్రసాదం పంపిణీ చేసేందుకు అన్నవరం దేవస్థానం నుంచి 500 కేజీల గోధుమ నూక ప్రసాదాన్ని పంపిస్తున్నారు. ఒక్కో భక్తునికి 50 గ్రాముల చొప్పున పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో పలు కేసులకు పరిష్కారం



జాతీయలోక్‌అదాలత్‌లో అవార్డుజారీ పత్రాన్ని అందజేస్తున్న న్యాయమూర్తి ప్రసాద్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో పలు కేసులకు పరిష్కారం లభించిందని ఏసీబీ కోర్టు, ఎఫ్ఏసీ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు న్యాయమూర్తి ప్రసాద్ తెలిపారు. శనివారం రాత్రి 9.30 గంటల వరకూ 11 వేల కేసులు పరిష్కరించారన్నారు. మరిన్ని కేసులపై తీర్పులు వెలువడుతున్నాయన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా జడ్జి (ఎఫ్ఏసీ) ప్రసాద్ మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలనే లక్ష్యంతో జాతీయ లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా న్యాయం జరిగేలా న్యాయమూర్తులు, కోర్టులు పని చేస్తున్నాయన్నారు. ప్రజలు, కక్షిదారుల్లో లోక్ అదాలత్‌లపై మరింత అవగాహన పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. లోక్ అదాలత్ బెంచ్‌కు వచ్చిన కేసులకు పరిష్కారం చూపి అవార్డు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం అవసరమైన డాక్టర్ ధ్రువపత్రాల జారీకి వైద్యాధికారులను అందుబాటులో ఉంచామని వివరించారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 43 బెంచ్‌లలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారన్నారు. ఫోక్సో, మర్డర్ వంటి కేసులు తప్ప, రాజీ ద్వారా పరిష్కారం అయ్యే అవకాశం ఉన్న కేసులకు పరిష్కారం చూపుతున్నారన్నారు. రాజీ పడదగిన వాటికి అవార్డ్ జారీ చేస్తే ఆ తీర్పులకు తిరుగుండదన్నారు. పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు దిగుతూ జారి పడి యువకుడి మృతి


శేఖర్ తాతయ్య (పాత చిత్రం)

పెరవలి: రైలు దిగుతూండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పెరవలి మండలం నల్లాకులవారిపాలెం గ్రామానికి చెందిన కోలా నాగ మణికంఠ సాయి శేఖర్ తాతయ్య (23) కాకినాడ నుంచి రైలులో వస్తున్నాడు. తణుకు రైల్వే స్టేషన్‌లో రైలు దిగుతూండగా ప్రమాదవశాత్తూ కాలు జారడంతో రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నల్లాకులవారిపాలేనికి చెందిన కోలా చిన్న పెద్ద శ్రీనుకు కుమారుడు శేఖర్ తాతయ్య, కుమార్తె ఉన్నారు. అనారోగ్యంతో శ్రీను కొన్నేళ్లుగా ఇంటి వద్దే ఉండి వైద్యం పొందుతున్నాడు. మృతుడు శేఖర్ తాతయ్య గ్రామంలో కేబుల్ టీవీ నిర్వహిస్తూ ఆ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చేతికి అంది వచ్చి, కుటుంబానికి ఆధారంగా ఉన్న కొడుకు మృతితో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 'ఈ వయస్సులో నాకు అనారోగ్యం రావడమేమిటి? ఉన్న కొడుకును ఆ భగవంతుడు తీసుకుపోవడమేమిటి? మాకిక దిక్కెవరు' అంటూ శ్రీను, శేఖర్ తాతయ్య తల్లి రోదిస్తున్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

నల్లజర్ల: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. నల్లజర్ల ఏఎస్సై ఎ.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటకు చెందిన నక్కా దుర్గాప్రసాద్ ద్వారకా తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్నాడు. అతడికి సహాయకుడిగా నక్కా గణేష్ (18) మోటార్ సైకిల్‌పై అనుసరిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున నల్లజర్ల మండలం అనంతపల్లి శివారు పోలేరమ్మ గుడి సమీపాన రోడ్డు పక్కన బైక్ పెట్టి నిలబడిన గణేష్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ


క్రీడాకారులకు అందించే సర్టిఫికెట్లను విడుదల చేస్తున్న అతిథులు


ఆత్మరక్షణ టెక్నిక్స్ ప్రదర్శిస్తున్న తైక్వాండో క్రీడాకారులు

- పీఆర్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి కృష్ణారావు
- 'సాక్షి' మీడియా, అభిషేక్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యాన వేసవి శిక్షణ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న 100 మంది
- అబ్బురపరచిన తైక్వాండో విన్యాసాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరికీ అవసరమని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి, ఆంగ్ల విభాగాధిపతి వీఎస్ఎల్ ప్రసాద్ కృష్ణారావు అన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన అభిషేక్ తైక్వాండో క్లబ్ సహకారంతో ప్రత్యేక వేసవి శిక్షణ, డిఫెన్స్ టెక్నిక్స్ అవగాహన కార్యక్రమం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి అభిషేక్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు, జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, కొరియాకు చెందిన ఫుట్ ఫైటింగ్ క్రీడ తైక్వాండో అని చెప్పారు. 120 దేశాల్లో 20 మిలియన్ల మంది తైక్వాండో నేర్చుకున్నారన్నారు. మన దేశంలో 1973లోను, ఆంధ్రప్రదేశ్‌లో 1975లోను తైక్వాండో ప్రారంభమైందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థలో ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి 50 మంది తైక్వాండో క్రీడాకారులు ఉద్యోగాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు.

ముఖ్య అతిథి కృష్ణారావు మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని గుర్తు చేశారు. ఆపదలో ఉన్నప్పుడు రక్షించుకునేందుకు మహిళలకు తైక్వాండో వంటి క్రీడలు సహాయపడతాయన్నారు. ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న అర్జునరావు ప్రవృత్తి తైక్వాండో అని, ఎందరో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారు చేసిన ఘనత ఆయనదేనని చెప్పారు. కళాశాల పీడీలు డాక్టర్ వర్మ, రమణ కూడా క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు.

అనంతరం శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు అందించే సర్టిఫికెట్లను కృష్ణారావు ఆవిష్కరించారు. డిఫెన్స్ టెక్నిక్స్, మార్షల్ ఆర్ట్స్ వివిధ రకాల పంచ్‌లు, ఆత్మరక్షణ, వెపన్ విన్యాసాల గురించి డిమాన్‌స్ట్రేషన్ ద్వారా కోచ్ అర్జున్‌రావు వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో సీనియర్ కోచ్‌లు సత్యనారాయణ, అఖిల, రత్నం, తులసి, చిరంజీవి, ఉమ్మడి జిల్లా నుంచి 100 మంది క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారులకు కృష్ణారావు, రమణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు కళాశాల వ్యాయామ విభాగం ఆధ్వర్యాన మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.

ప్రియుడి సాయంతో యువతి ఘాతుకం

- తిరుమలాయపాలెం యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- ఆర్థిక లావాదేవీలే కారణం
- ఇద్దరు నిందితుల అరెస్టు


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు


పోలీసుల అదుపులో నిందితులు

గోకవరం: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెంలో ఇటీవల జరిగిన యువకుడి హత్య కేసు మిస్టరీ వీడింది. ఆర్థిక వ్యవహారాలే ఈ హత్యకు కారణమని నిర్ధారణ అయ్యింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు శనివారం ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం గొల్లవీధికి చెందిన ఒమ్మి నాగశేషు, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం చిలకవీధికి చెందిన కుర్ల డేబోరా అలియాస్ దివ్య ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. ఆ సమయంలో నాగశేషుకు డెబోరా రూ.2 లక్షల నగదు, బంగారు గొలుసు ఇచ్చింది. ఇదిలా ఉండగా ఏడాది కిందట నాగశేషుకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన యువతితో వివాహం జరిగింది. ఈ విషయాన్ని అతడు డెబోరా వద్ద దాచాడు. మరోపక్క డెబోరా, అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాముల గ్రామానికి చెందిన కరణం శివన్నారాయణ ఏడాది క్రితం నుంచి ప్రేమించుకుంటున్నారు. వారు నెల రోజులుగా గోకవరంలో నివాసం ఉంటున్నారు. నాగశేషుకు వివాహమైందని తెలిసిన డెబోరా.. గతంలో తానిచ్చిన రూ.2 లక్షల నగదు, బంగారు గొలుసు తిరిగి ఇవ్వాలని కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తోంది. దీనిపై నాగశేషు దాట వేస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతడిని చంపాలనే ఉద్దేశంతో ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి కొత్త ప్రియుడు శివన్నారాయణతో కలిసి డెబోరా తిరుమలాయపాలెం వెళ్లింది. మేడపై నిద్రిస్తున్న నాగశేషును నిద్ర లేపింది. గతంలో తానిచ్చిన డబ్బు, బంగారం గురించి అడగగా తరువాత ఇస్తానని అతడు చెప్పాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన డెబోరా తన వెంట తెచ్చుకున్న కత్తిపీటతో నాగశేషుపై దాడి చేసి, తీవ్రంగా గాయపరచింది. శివన్నారాయణ కర్రతో కొట్టాడు. అడ్డం వచ్చిన నాగశేషు తల్లి గంగను కూడా కొట్టి చంపుతామంటూ బెదిరించారు. తీవ్రంగా గాయపడిన నాగశేషు ఆస్పత్రికి తరలిస్తూండగా మృతి చెందాడు. హతుడి తల్లి గంగ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితులు డెబోరా, శివన్నారాయణలను గోకవరం అచ్చియ్యపేటలో శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక బైక్, కర్ర సీజ్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిపీటను సంఘటన స్థలంలోనే స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు ఉన్నారని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రేమ పేరుతో నాగశేషు తనను తనను మోసం చేసి, నగదు, బంగారం తీసుకున్నాడని పేర్కొంటూ డెబోరా కొంత కాలం క్రితం రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసిందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని తెలిపారు. నిందితులు డెబోరా, శివన్నారాయణలను రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి, నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసిన కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

సమష్టి కృషితో 'నన్నయ' అభివృద్ధి

- నూతన వీసీ ఆచార్య పద్మరాజు పిలుపు
- వర్సిటీలో బాధ్యతల స్వీకరణ


'నన్నయ' వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని సిబ్బందికి నూతన ఉప కులపతి (వైస్ చాన్సలర్) ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు పిలుపునిచ్చారు. నూతన వీసీగా వర్సిటీలోని చాంబర్‌లో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ ముఖద్వారం వద్ద బోధన, బోధనేతర సిబ్బంది మేళతాళాలు, వేద పండితుల ఆశీర్వచనాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముఖ ద్వారం వద్ద ఉన్న ఆదికవి నన్నయ విగ్రహానికి, సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆచార్య పద్మరాజు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీగా ఉన్న జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తదితరుల సమక్షంలో రిజిస్టర్‌లో సంతకం చేసి, బాధ్యతలు చేపట్టారు. అనంతరం వర్సిటీ కన్వెన్షన్ హాలులో సిబ్బందితో ఆచార్య పద్మరాజు సమావేశమయ్యారు. తనను వీసీగా నియమించేందుకు కారకులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్య స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్యామలరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న సీఎం విజన్‌ను దృష్టిలో పెట్టుకుని, నూతన విద్యా విధానం అమలుకు, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. గోదావరి జిల్లాల్లో అపారంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు పని చేద్దామని అన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ఆచార్య పద్మరాజు చెప్పారు. అనంతరం వర్సిటీ కేంద్ర పాలనా భవనంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ రూమును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

హిజ్రా దారుణ హత్య


సంఘటన స్థలం వద్ద స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ రమణ


ఆనంది (పాతచిత్రం)

ఆలమూరు: జొన్నాడ బస్టాండ్ సమీపాన జాతీయ రహదారి పక్కన ఓ హిజ్రా దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మరిపట్ల ఆనంద్ అలియాస్ ఆనంది (33) కొన్నేళ్లుగా ధవళేశ్వరంలో నివాసం ఉంటోంది. అమ్మానాన్నలను చూసేందుకు వెళ్తానంటూ ఆమె కొంత నగదుతో బయలుదేరినట్టు సహచర హిజ్రాలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె జొన్నాడలోని 216ఎ జాతీయ రహదారి పక్కన పంట కాలువ డ్యామ్ సమీపాన పశువుల పాక చెంతన ఉన్న పంట కాలువలో శవమై కనిపించింది. ఆమెను పాశవికంగా హతమార్చిన దుండగులు ఆమె మృతదేహాన్ని పంట కాలువలో కుక్కేశారు. ఆనంది మృతదేహాన్ని గుర్తించిన స్థానిక రైతు సత్తి సత్యనారాయణరెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ నేతృత్వంలో రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్సైలు ఎం.వెంకటరమణ, ఎస్.శివప్రసాద్‌లు పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాకినాడ నుంచి వేలిముద్ర నిపుణుడు కె.ప్రవీణ్‌కుమార్ బృందాన్ని, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. తనిఖీలు చేయించి ఆధారాలు సేకరించారు. అక్కడ లభించిన ఆనవాళ్లను బట్టి హత్యకు ముందు తీవ్ర పెనుగులాట జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. హంతకులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్సై శివప్రసాద్ చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆనంది హత్య విషయం తెలియడంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో హిజ్రాలు సంఘటన స్థలానికి తరలివచ్చారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. పోలీసులకు అనుమానితుల పేర్లు అందించి, ఆ దిశగా విచారణ జరపాలని అభ్యర్థించారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి నందు

నక్కపల్లి(అనకాపల్లి జిల్లా): కారు ఢీకొని మహిళ దుర్మరణం పాలైన ఘటన ఒడ్డిమెట్ట గ్రామంలో చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడికి చెందిన వై.నారాయణమ్మ(52) తన మనవరాలు నందును తీసుకుని శనివారం రాత్రి 10 గంటలకు నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్లింది. పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి తుని వైపు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నారాయణమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేసి తీవ్రంగా గాయపడిన చిన్నారిని తుని ఏరియా ఆస్పత్రికి పంపించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు.